క్లుప్తంగా

సైనిక్ స్కూల్‌కు ఎంపిక

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన జాదవ్ రవీందర్, కమల దంపతుల కుమారుడు జాదవ్ విశ్వజిత్ సిమ్లాలోని సైనిక్ స్కూల్‌లో సీటు సాధించాడు. గత ఫిబ్రవరిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలో 1204 ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తాం

బేల: కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తామని ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇటీవల కాంగ్రెస్ అనుసంధాన ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా నియమితులైన ఎండీ అఖిల్‌కు పూలమాలలు వేసి, సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, ఫైజుల్లాఖాన్, వాంఖడే వామన్, దేవ్‌తాళే విఠల్, గుండవార్ సంజయ్, మడావి చంద్రకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వైఎస్ఆర్ టీపీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ చేయడం లేదన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన ఉద్యోగాలపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. పేపర్ లీకేజీ ఘటనతో రద్దు అయిన పరీక్షలను ఎప్పుడు నిర్వహిస్తారో సీఎం కేసీఆర్ ప్రకటన చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ టీపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పెందుర్ మనోహర్, పట్టణ అధ్యక్షుడు రాహుల్ రెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అస్లాం, మెస్రం శంకర్, కన్నాజి కృష్ణంరాజు, అర్జున్, మాణిక్‌రావు పాల్గొన్నారు.

అడవుల్లోకి వెళ్లొద్దు

బోథ్: వేసవిలో ఆహారం దొరకక అడవుల్లో చిరుతలు సంచరించే అవకాశం ఉందని, వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు అడవుల్లోకి వెళ్లవద్దని డీఆర్వో ప్రమోద్ తెలిపారు. బుధవారం మండలంలోని ఘన్‌పూర్, గుట్టపక్కతండాలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆహారం కోసం చిరుతల వచ్చే అవకాశం ఉన్నందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్

కైలాస్‌నగర్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి మైనార్టీ నాయకులు ఉపవాస దీక్షలను విరమించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పాల్గొని పండ్లు, స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జహీర్ రంజాని, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్

ఇంద్రవెల్లి: మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు అందించేందుకు బుధవారం వాటర్ ప్లాంట్ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని పలుమార్లు తమ దృష్టికి రావడంతో జెడ్పీ నిధులు రూ. 5 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

సిరికొండ: మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు మండల ఇన్‌చార్జి విద్యుత్ ఏఈ రోహిదాస్ తెలిపారు. విద్యుత్ సమస్యల దరఖాస్తులను స్వీకరించి, పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదోడి ఫ్రిజ్‌కు భలే గిరాకీ

- డిజైన్ బట్టి ధరలు
- పెరుగుతున్న ఖర్చులు
- భారంగా కుటుంబ పోషణ
- ఆదుకోవాలని వేడుకుంటున్న కుమ్మరులు



కుండలు తయారు చేసేందుకు సిద్ధం చేస్తున్న మట్టి



కుండలను తయారు చేస్తున్న మహిళ

ఆదిలాబాద్‌రూరల్: వేసవి కాలం వచ్చిందంటే చాలు పేదలకు కుమ్మరులు తయారు చేసే మట్టి కుండలు గుర్తుకొస్తాయి. ప్రతిఒక్కరూ మట్టికుండల్లోని నీటిని తాగేందుకే మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం కొన్ని రోజుల నుంచి ఎండలు దంచికొట్టడంతో కుండలకు గిరాకీ పెరిగింది. మట్టి కుండలోని నీటిని తాగితే ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు. కుండ రకాలను, సైజులను బట్టి ధర ఉంటుంది. ప్రభుత్వాలు చేతువృత్తుల వారిని ఆదుకోవడంలో విఫలం చెందుతున్నాయని కుమ్మరి కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతి వృత్తిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న వారి పరిస్థితి రోజు రోజుకు దిగజారుతోంది.

వేసవిలో బిజీ బిజీ..

వేసవి కాలం వచ్చిందటే చాలా కుమ్మరులు కుండలు, రంజాన్లు తయారీలో బిజీ బిజీగా గడుపుతారు. కుండలను తయారు చేయడానికి చెరువు మట్టి, గుర్రం పేడ, చెక్కపొల్లు (కట్టెలు) తయారీకి ఉపయోగిస్తారు. ఒక కుండ తయారు చేయడానికి సుమారు రూ. 100 నుంచి రూ. 120 ఖర్చు అవుతోంది. కాని కొన్ని సందర్భాల్లో వాతావరణం అనుకూలించకపోతే పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఇతర ప్రాంతాల్లో గుర్తింపు

ఆదిలాబాద్ కుండలకు ఇతర రాష్ట్రల్లో కూడా గిరాకీ ఉంటుంది. ఆదిలాబాద్ కుండలు అని ప్రత్యేకించి వినియోగదారులు అడిగి కొనుగోళ్లు చేస్తారని కుండల తయారీ చేసే కుమ్మరులు చెబుతున్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో కూడా కుండలకు డిమాండ్ ఉంది. కాని ప్రభుత్వం ప్రోత్సాహం అందించకపోవడంతో కుమ్మరి కులస్తులు నిరాశ చెందుతున్నారు. అన్ని రకాల వస్తువుల ధరలు పెరగడంతో పెట్టుబడి, శ్రమ అధికం కావడంతో కొంత మంది కుల వృత్తులను మానేయాల్సిన పరిస్థితి నెలకొంది. నాగాపూర్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎంతో ఇష్టంగా మట్టి కుండలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

ప్రభుత్వం అండగా ఉండాలి

మేము కుల వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నాం. సర్కారు మా లాంటి కుల వృత్తుల వారికి అండగా ఉంటే కొంత అభివృద్ధి సాధిస్తాం. సబ్సిడీపై రుణాలు అందజేస్తే మంచిగా ఉంటుంది. కొంత భారం తగ్గుతోంది.

– ఇటిక్యాల లలితా, ఆదిలాబాద్ రూరల్

కుల వృత్తిని కాపాడుకునేందుకే..

కుమ్మరి కుల వృత్తిని కాపాడుకునేందుకే కుండలను తయారు చేస్తున్నా. నేను ఇంటర్ వరకు చదువుకున్నా. మా లాంటి వారికి బ్యాంకు రుణాలు అందజేసి, అభివృద్ధికి కృషి చేయాలి.

– రవీందర్, ఆదిలాబాద్ రూరల్

అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లోకి..

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఎదులాపురం: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే యువత బీఆర్ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం పట్టణంలోని జైజవాన్‌నగర్‌కి చెందిన 40 మంది యువకులు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తూ, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, కోఆప్షన్ సభ్యులు సంజీవ్, గోలి శంకర్, అబ్దుల్, అతీక్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

ఎదులాపురం: జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బుధవారం అంబేద్కర్ విగ్రహావిష్కరణ, జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దుర్గం శేఖర్‌తో కలిసి వాల్ పోస్టర్ విడుదల చేశారు. దేశానికి ఒక దిశను చూపిన మహనీయుడు అంబేద్కర్ అని, ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మేకల మల్లన్న, మల్యాల స్వామి, శైలందర్ వాఘ్మారే, శాలిక్ రావు నగరాడే, రత్నజాడే, సోగల సుదర్శన్, రామ్ చందర్, శోభాబాయి బండారి, రవీందర్ పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి

ఎదులాపురం: హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 15, 16న నిర్వహించే తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఐదోవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శశికాంత్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పెన్షన్ ప్రతీ నెల ఒకటో తేదీన జమ కావడం, పాత పెన్షన్ విధానం, రైల్వే టికెట్లపై రాయితీ, నగదు రహిత చికిత్స వంటి అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గంగాధర్, వెంకటస్వామి, కార్యదర్శులు దిలీప్, దేవిదాస్, సామల రాజవర్ధన్, గోలి రాజన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను విశ్రాంత ప్రధానోపాధ్యాయులు లక్ష్మి నర్సయ్య బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రడాపు మధుసూధన్, ఉపాధ్యాయులు గీతవాణి, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

బోథ్ ఎస్సైకి స్టేషన్ హౌస్ వర్టికల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్సై రవీందర్

బోథ్: బోథ్ ఎస్సై రవీందర్‌కు డిసెంబర్ నెలలకు సంబంధించి స్టేషన్ హౌస్ వర్టికల్ అవార్డు లభించింది. ఈమేరకు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం అవార్డు అందుకున్నారు. పోలీసు సిబ్బంది, గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

హస్నాపూర్‌లో 'బలగం'

తాంసి: మండలంలోని హస్నాపూర్‌లో మంగళవారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శించారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద సర్పంచ్ అలాలి జ్యోతి ఆధ్వర్యంలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. సినిమాలోని ఆత్మీయత, అనుబంధం, కలిసికట్టుగా ఉండే విధంగా చూపించడంతో గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నర్సింగ్, విలాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, చందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంబురాలు



కేక్ తినిపించుకుంటున్న పంచాయతీ కార్యదర్శులు



ఎంపీపీని సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

తాంసి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ బుధవారంతో నాలుగేళ్లు పూర్తయింది. దీంతో పంచాయతీ కార్యదర్శులు సంబురాలు జరుపుకున్నారు. ఎంపీపీ సంతోష్, జెడ్పీటీసీ సుధాకర్, వైస్ ఎంపీపీ లస్మన్న, భీంపూర్ సర్పంచ్ లింబాజీని సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శులు సాయి, అజయ్, సాయినంద, అనిల్, నితిన్ పాల్గొన్నారు.

జైనథ్: పంచాయతీ కార్యదర్శులుగా నాలుగు ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు సంబురాలు జరుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, ఎంపీడీవో గజానన్ రావ్, ఎంపీవో వెంకట్ రాజులను సన్మానించారు.

ఇంద్రవెల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా విధుల్లో చేరి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద సంబురాలు జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో సంతోష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, విజయ్ కుమార్, రమణ పాల్గొన్నారు.

అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకం

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరి నాలుగు సంవత్సరాలు అవుతున్న సందర్భంగా బుధవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. అంతకుముందు తమను రెగ్యులరైజ్ చేసేలా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సహకరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎంపీవో శోభన, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

సిరికొండ: బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన 19 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీ, నర్మాదా, ఫర్వీన్ బేగం, బత్తుల అశోక్, తోకల చిన్న రాజన్న, మల్లేష్, బషీర్, ఎక్బాల్, రాజన్న, లోకండే సునీల్, రాజరాం పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న క్షమాదేశ్‌పాండే

తాంసి: ప్రతిఒకరికీ చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. బుధవారం మండలంలోని జామిడి గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒకరికీ న్యాయం దక్కాలంటే చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కేశవ్ రెడ్డి, గ్రామ పెద్దలు వినోద్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, రామన్న, శ్రీహరి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. శిథిలావస్థలో వంతెన



బజార్‌హత్నూర్: మండలంలోని ఇచ్చోడ, సొనాల ఆర్అండ్‌బీ రోడ్డులో కొలారి గ్రామం సమీపంలో గల వంతెన శిథిలావస్థకు చేరింది. కృంగిన వంతెనతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో వంతెన దాటలేని పరిస్థితి. అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: నర్సయ్య, ఈఈ ఆర్అండ్‌బీ, ఫోన్: 94928 10052

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి

- సర్వసభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఇచ్చోడ: నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ సమావేశం మందిరంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రోజురోజుకూ ఎండలు ముదురుతున్న నేపథ్యంలో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని సర్పంచులు తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఎంపీపీ ప్రీతంరెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలో ఆదివాసీనగర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి కోరారు. ఉపాధి పనులు చేపడుతున్న ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు. సమవేశంలో డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: కల్యాణలక్ష్మి పథకంతో ఆడపిల్లల కుటుంబాల్లో ఆనందం కనిపిస్తుందని బోథ్ ఎమ్మెల్యే బాపురావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 106 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రీతంరెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్, తహసీల్దార్ మోహన్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు పాల్గొన్నారు.

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంతో నిరుపేద ఆడబిడ్డల జీవితాల్లో వెలుగు నింపుతుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, బోథ్ ఏఎంసీ చైర్మన్ రుక్మాణ్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులు నారాయణ సింగ్, దావుల భోజన్న, శివారెడ్డి, తహసీల్దార్ పవన్ చంద్ర, కోఆప్షన్ మెంబర్ సయ్యద్ లాలు, మాకునూరి రాములు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితుల తరఫున పోరాడాలి

- ఎంపీ సోయం బాపురావు



సభ్యులను సన్మానిస్తున్న ఎంపీ సోయం

ఆదిలాబాద్: న్యాయవాదులు బాధితుల పక్షాన ఉండి పోరాడాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు అన్నారు. ఇటీవల జిల్లా బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్రాల నగేశ్, నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సమాజంలో న్యాయవ్యవస్థ ఎంతో కీలకమైనదని, న్యాయవాదులు మానవతా దృక్పథంతో వ్యవహరిస్తే ఎల్లప్పుడు న్యాయమే గెలుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, ఆదినాథ్, జోగు రవి, దినేష్ మటోలియా, విజయ్, ముకుంద్, రత్నాకర్ రెడ్డి, చిలుకూరి జ్యోతిరెడ్డి, ధోని జ్యోతి, రవి, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఎదులాపురం: విప్లవ విద్యార్థి నాయకులు, ఉస్మానియా అరుణతార, ఇండియన్ చెగువేరా పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు కామ్రేడ్ జార్జిరెడ్డి వర్ధంతిని ఈనెల 13, 14 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో బుధవారం కార్యక్రమానికి వాల్ పోస్టర్ విడుదల చేశారు. జార్జిరెడ్డి స్ఫూర్తితో విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు కాము, రవీందర్, గజేందర్, సుందర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని..

నార్నూర్: ఏప్రిల్ 14న అంబేద్కర్ 132వ జయంతిని ప్రతీ గ్రామంలో ఘనంగా నిర్వహించాలని బహుజన జాగృతి సేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఝాడే నాందేవ్ బుధవారం అన్నారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు, బీసీలు అందరూ కలిసి జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మి

జైనథ్: కల్యాణలక్ష్మి నిరుపేదలకు వరమని ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. సీఎం కేసీఆర్ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేంద్ర రావు, నాయకులు తుమ్మల వెంకట్‌రెడ్డి, దుమాల దేవన్న, తదితరులు పాల్గొన్నారు.